జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

మంగళవారం | 18-3-2025 శ్రీకాకుళం సంపుటి: 2 సంచిక: 278 పేజీలు: 4 వెల : రూ.7




## అనధికారిక ఇటుక బట్టీలతో..

# చెరువులు, వాగులు మాయం

* నిబంధనలకు నీళ్లొదిలిన ఇటుక బట్టీలు నిర్వాహకులు
* బింగుపేటలో జోరుగా అక్రమ దందా
* చోద్యం చూస్తున్న అధికారులు
* అధికారుల కనుసన్నల్లో అక్రమార్కుల దందా
* ఇటుక బట్టీలతో కోట్లు గడిస్తున్న వ్యాపారులు
* పర్యావరణానికి ముప్పు
* ఇటుక బట్టీలతో పర్యావరణ విధ్వంసం
* అనుమతులు లేకుండానే వ్యాపారం
* కార్మికుల బతుకులు ఛిద్రం
* కార్మికుల హక్కులకు తిలోదకాలు
* వెట్టి చాకిరీ, కనీస వేతనం లేని కార్మికులు
* పర్యావరణానికి పెను ముప్పు
* కాలుష్యం, భూగర్భ జలాలు ధ్వంసం
* ప్రభుత్వ ఆదాయానికి గండి
* రాయల్టీ చెల్లించని వ్యాపారులు
* అటవీ సంపద దోపిడీ
* ఇటుక బట్టీలకు కట్టెల సరఫరా

**శ్రీకాకుళం క్రైం, ఎచ్చెర్ల, మార్చి 17 (వార్త):** చెరువు భూముల్లో అక్రమార్కులు యథేచ్ఛగా ఇటుక బట్టీలు ఏర్పాటు చేసుకుని రూ.కోట్లు సంపాదిస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘించి ఒప్పంద కూలీలను ఏర్పాటు చేసుకుని ఇటుకల తయారీకి పాల్పడుతున్నారు. కాలుష్య నియంత్రణ ధ్రువపత్రాలు, మున్సిపాలిటీ ట్రేడింగ్ లైసెన్సులు, ప్రధాన రహదారికి దూరంగా ఉండాలన్న నిబంధనలేవీ పాటించడం లేదు. దీంతో చెరువులు, వాగులు మాయమవుతున్నాయి.

జిల్లా కేంద్రం శివారులో పొన్నాడ – బింగుపేట గరమల మధ్య సాగునీటి చెరువులో ఇటుకబట్టీలు ఏర్పాటు చేశారు. రోడ్డుపై వెళ్తున్న వారిపై మట్టి, కళ్లకు దుమ్ము, ధూళి పడుతున్నా పట్టించుకునే నాథులే లేరు. ఈ బట్టీలో ఏడాదికి 5 లక్షల నుంచి 25 లక్షల వరకు ఇటుకలు తయారు చేస్తున్నారు. 2 వేల ఇటుకలను రూ.20 వేల చొప్పున అమ్ముతున్నారు. ఏటా ఇటుకల బట్టీ ద్వారా సుమారు రూ.100 కోట్లకుపైగా జిల్లాలో వ్యాపారం సాగుతోందని అంచనా. ముఖ్యంగా లారీల్లో ఇటుకలు తరలించి కల్వర్టు, రోడ్లు శిథిలమయ్యేందుకు కారణమవుతున్నారు. ఇటుక బట్టీల తయారీదారులకు కొందరు రాజకీయ నాయకుల అండదండలు ఉన్నాయి. ఇటుకల తయారీదారులు పరిశ్రమలు, గనులు, రెవెన్యూ, కార్మిక, విద్యుత్తు, అటవీ, రవాణా శాఖల అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలి. కూలీలకు భద్రత, బీమా, ఇళ్ల సౌకర్యం, బాల కార్మికులకు దూరంగా పెట్టడం వంటి నిబంధనలు పాటించడం లేదు. కార్మిక చట్టం ప్రకారం ప్రతి బట్టీ యజమాని పురపాలక సంఘంలో ట్రేడ్ లైసెన్సు తప్పనిసరిగా తీసుకోవాలి. ఎన్ని ఇటుకలు తయారు చేస్తారో దానికి సంబంధించిన వివరాలు పొందుపర్చాలి. ఎంత విస్తీర్ణంలో తయారు చేస్తున్నారు, కార్మికుల భద్రత వంటివి చూపించాలి. అన్ని సవ్యంగా ఉన్నాయంటూ రెవెన్యూ అధికారులు ఇచ్చిన ధ్రువపత్రం ఉంటేనే విద్యుత్తు శాఖ అధికారులు విద్యుత్తు కనెక్షన్ ఇవ్వాల్సి ఉంటుంది. ఇవేవీ



లేకుండా గుడ్డిగా కాసులకు కక్కుర్తి పడి అనుమతులు ఇచ్చేసున్నారు.

జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా ఇటుక బట్టీ వ్యాపారులు దందా నిర్వహిస్తున్నారు. రోజురోజుకు పుట్టగొడుగుల్లా పుట్టుకొసున్న ఇటుక బట్టీలు కార్మికుల బతుకులను ఛిద్రం చేస్తుండడంతో పాటు జీరో వ్యాపారం జోరుగా జరుగుతోంది. అక్రమంగా వ్యాపారం నిర్వహిస్తున్న వ్యక్తులు బట్టీ కార్మికులకు కనీస వేతన చట్టం అమలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. కొందరు ఎలాంటి అనుమతులు లేకుండా వ్యాపారం కొనసాగిస్తున్నారు. వ్యాపారులు నిబంధనలు ఉల్లఘించినప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లాలోని పలు మండల కేంద్రాలు, గ్రామాల్లో సుమారు 70 వరకు ఇటుక బట్టీలు నడుస్తున్నాయి.

### యథేచ్ఛగా వ్యాపారం....

జిల్లాలోని పలు ప్రాంతాల్లో వ్యవసాయ భూముల్లో, చెరువుల్లో నిబంధనలకు విరుద్ధంగా బట్టీలు నిర్వహిస్తున్నారు. వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములకు వినియోగిస్తే నాలా పన్ను చెల్లించాల్సి ఉంటుంది. వ్యాపారులు పన్నుల చెల్లింపును పట్టించుకోవడం లేదు.



కాలుష్య నియంత్రణ, భూగర్భ జల వనరులు, పంచాయతీలు, కార్మిక శాఖ, విద్యుత్ శాఖ అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. కొందరు ఎలాంటి అనుమనుతులు లేకుండానే వ్యాపారాలు సాగిస్తున్నారు. వాల్టా చట్టాన్ని తుంగలో తొక్కుతూ చెరువులు, వాగులు, ప్రభుత్వ స్థలాల నుంచి ఇటుకలకు అవసరమైన మట్టిని సేకరిస్తున్నారు. ప్రభుత్వానికి ఎలాంటి రాయల్టీ చెల్లించడం లేదు. నిబంధనల ప్రకారం ఒక క్యూబిక్ మీటర్ మట్టిని తవ్వితే రాయల్టీ కింద రూ. 42 చెల్లించాల్సి ఉంటుంది. లక్ష ఇటుకలు తయారు చేస్తే రూ. 6వేల వరకు చెల్లించాల్సి ఉంటుంది. జిల్లా వ్యాప్తంగా ప్రతీయేడాది సుమారు 5లక్షలకు పైగా క్యూబిక్ మీటర్ల మట్టిని తవ్వుతున్నారన్న అంచనాలున్నాయి. దీంతో పాటు అటవీ ప్రాంతం నుంచి కట్టెలను సేకరించి ఇటుకలను కాల్చడానికి వినియోగిస్తున్నారు.

### కార్మికులకు దక్కని భరోసా..

ఇటుక బట్టీల్లో పనిచేసే కార్మికులకు ఎలాంటి భరోసా లేకుండా పోయింది. ఒరిస్సా, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల నుంచి తక్కువ డబ్బులకు తీసుకువచ్చి పనిచేయించుకుంటున్నారు. ముందుగా కొంత డబ్బు వారికి అడ్వాన్సుగా ఎరవేసి తక్కువ జీతానికి తీసుకువచ్చి పని కల్పిస్తున్నారు. ప్రభత్వ నిబంధనల ప్రకారం పనిచేసే ప్రతి కార్మికుడికి, కార్మికురాలికి బ్యాంకు ఖాతా తప్పనిసరిగా తీయాలి. కార్మికులు ఎక్కడైతే పనిచేస్తారో అక్కడ రేకులతో షెడ్డు నిర్మాణం, స్నానం చేయడానికి బాత్రూమ్ తాత్కలికంగా ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. కార్మికుల పిల్లలు చదువుకు దూరం కాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంది. వారానికి ఒకసారి ఖర్చుల కోసం సామానులకు కొంత డబ్బులు ఇవ్వాల్సి ఉంటుంది. నెల తరువాత వారు పనిచేసిన వేతనానికి చెందిన డబ్బులు చేతికి లేదంటే వారు తీసిన బ్యాంకు ఖాతాలోకి తప్పనిసరిగా జమచేయాలి. నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న ఇటుక బట్టీల వ్యాపారంపై అధికారులు దృష్టి సారించి చర్యలు తీసుకోవాల్సిన అవసరముంది.

జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం


## చైతన్య యాత్రలు వాయిదా



**మందస, మార్చి 17(వార్త):** ఈ నెల 18, 19 తేదీల్లో జరగాల్సిన చైతన్య యాత్రలను వాయిదా వేసినట్టు కార్గో ఎయిర్‌పోర్ట్ వ్యతిరేక పోరాట కమిటీ ప్రతినిధులు తెలిపారు. సోమవారం గంగువాడలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు.కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, వ్యవసాయశాఖ మంత్రి, ఎమ్మెల్యే శిరీష, వివిధ రాజకీయ పార్టీల నాయకులకు వినతి పత్రాలు అందజేసిన అనంతరం కార్యాచరణ తేదీలను తెలియజేస్తామన్నారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు కొమర వాసుదేవు, తామాడ తుంభనాదం, చిత్త కూర్మారావు, సర్పంచ్ పొట్టి ధర్మారావు, చిత్త గున్నయ్య, లండ రామస్వామి, జోగి అప్పారావు, మర్ల సంతోష్, దున్న రామారావు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలను పరిష్కరించాలి

**-184 అర్జీల స్వీకరణ**

**-కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్**



**శ్రీకాకుళం, మార్చి 17(వార్త):** ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల నమోదు మరియు పరిష్కార వేదికలో కలెక్టర్ తో పాటు జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ 184 అర్జీలు స్వీకరించారు. రెవెన్యూ, ఆర్డబ్ల్యుఎస్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, గృహ నిర్మాణ శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, గ్రామీణాభివృద్ధి, స్త్రీ మరియు మహిళా శిశు సంక్షేమ శాఖ, పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్, దేవదాయ శాఖ, భూగర్భ గనులు, ఇరిగేషన్, డ్వామా, ట్రెజరీ, సర్వే అండ్ లాండ్ రికార్డులు తదితర శాఖలకు సంబంధించి అర్జీలు స్వీకరించారు. అర్జీలు స్వీకరించిన వారిలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు, డిప్యూటీ కలెక్టర్ పద్మావతి, డిఆర్డిఎ పిడి కిరణ్ కుమార్, జడ్పీ సీఈవో ఎల్ఎన్ వి శ్రీధర్ రాజ ఉన్నారు. ప్రజా ఫిర్యాదుల నమోదు మరియు పరిష్కార వేదికలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## లిఫ్ట్ ఇచ్చి బంగారాన్ని కాజేసిన ఘనుడితో పాటు ఇద్దరి అరెస్టు



**పలాస, మార్చి 17(వార్త) :** లిఫ్ట్ ఇచ్చి బంగారాన్ని కాజేసిన ఘనుడితో పాటు మరో ఇద్దరిని అరెస్టు చేశామని కాశీబుగ్గ డీఎస్పీ ఎం.వెంకటప్పారావు తెలిపారు. సోమవారం కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పలాసలో ఈనెల 12న కిడ్నీ ఆసుపత్రి ఎదురుగా పాత జాతీయ రహదారిపై బస్సు కోసం వేచి ఎదురుచూస్తున్న వృద్ధురాలకు లిఫ్ట్ ఇచ్చి ఆమె మెడలోని బంగారు మంగళసూత్రాన్ని దొంగిలించిన ఇచ్ఛాపురంలోని పురుషోత్తపురం కాలనీకి చెందిన బంగారు బండి ప్రదీప్‌ను, మరో ఇద్దరు స్నేహితులను అదుపులోకి తీసుకుని, దోచుకున్న బంగారాన్ని, కత్తి, మూడు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. సమావేశంలో కాశీబుగ్గ సీఐ సూర్యనారాయణ పాల్గొన్నారు.

## అంగన్వాడీ కేంద్రాల్లో సంక్షేమ పథకాలు అందుతున్నాయా?

**- ఆరా తీసిన రాష్ట్రబాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు**



**పలాస, మార్చి 17(వార్త):** అంగన్వాడీ కంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు, చిన్నారులకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు సకాలంలో అందుతున్నాయా అని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు ఆరా తీశారు. పలాస మండలంలోని పెంటిబద్ర, రంగోయి అంగన్వాడీ కేంద్రాలను, పాఠశాలలను మధ్యాహ్న భోజన పథకమును సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాలలు, బాలింతలతో, గర్భిణులతో మాట్లాడి ప్రభుత్వం ద్వారా అందే సౌకర్యాలు, సంక్షేమ ఫలాలను సక్రమముగా అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. మౌలిక వసతులు పరిశీలించగా పరిశుభ్రంగా ఉందని గుర్తించి సంతృప్తి వ్యక్తం చేశారు. పెంటిబద్ర గ్రామంలో పాఠశాలకి ఆనుకుని నిరుపయోగంగా ఉన్న బావిని పూడ్చి వెయ్యమని ఎంఈఓకు ఆదేశించారు. పలాసలో స్త్రీ,శిశు సంక్షేమ అభివృద్ధి సంస్థ ద్వారా నిర్వహిస్తున్న బాల సదనమును సందర్శించడం జరిగినది. అక్కడ ఉన్న మౌలిక వసతులు రికార్డ్స్ పరిశీలించి తగు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బాలల సంక్షేమ సమితి చైర్పర్సన్ యు శ్రీలక్ష్మి, సభ్యులు యం.గన్నప్పాడు, జిల్లా బాలల రక్షణ అధికారి కెవి రమణ, సంస్థల బాలల రక్షణ అధికారి మెట్ట మల్లేశ్వరరావు, సమగ్ర శిక్ష నుంచి జిసిడిఓ శ్రీమతి ఎస్.నీరజ, జిల్లా బాలల రక్షణ విభాగం నుంచి కౌన్సిలర్ డి.సీతారాములు, మండల విద్యాశాఖ అధికారి సత్యం, ఐసిడిఎస్ సూపర్వైజర్ యు.లత, ఎస్.సరస్వతి, గంగమ్మ, అంగన్వాడి కార్యకర్తలు బి.జ్యోతి, చంద్రమ్మ పాల్గొన్నారు.

## "పి-4" సర్వే పరిశీలించిన కలెక్టర్



**శ్రీకాకుళం, మార్చి 17(వార్త):** "స్వర్ణాంధ్రఏ2047" కార్యాచరణలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "పి-4" (ప్రభుత్వం, దాతలు, ప్రజల భాగస్వామ్యం) విధానం పై సర్వే జరుగుతున్న తీరును జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ సోమవారం శ్రీకాకుళం మండలం కొత్తపేట, బాదుర్లపేట సచివాలయాల పరిధిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పేదరికాన్ని పూర్తిగా నిర్మూలించడమే "పి-4" విధానం ముఖ్య ఉద్దేశ్యమని స్పష్టం చేశారు. ప్రజలతో ముఖాముఖి మాట్లాడి, వారి సమస్యలను తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రజలు తమ విలువైన అభిప్రాయాలను swarnandhra.ap.gov.in/p4 వెబ్‌సైట్‌లో తెలియజేయాలని కలెక్టర్ కోరారు.

# రైతులు సహకరిస్తే భూ సర్వే వేగవంతం



**వంగర, మార్చి 17(వార్త):** గ్రామాల్లో భూ రీసర్వేకు రైతులు సహకరించాలని,సహకరిస్తే వేగవంతంగా పూర్తి చేయటానికి వీలుకలుగుతుందని అందుచేతను గ్రామాల్లో రైతులు సహకారం అందించాలని రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్ రెడ్డిగంగా భవానీ,తహసీల్దార్ డి. ధర్మ రాజు రైతులను కోరారు. సోమవారం ఈ మండలంలోని కొండచాకరాపల్లి గ్రామంలో రైతులతో రీ సర్వే ప్రత్యేకసమావేశంలో వారు సూచించారు. రీసర్వే పక్కాగా చేసి రైతులకు ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు ప్రభుత్వం ప్రయోగాత్మకంగా రీసర్వే చేయాలని నిర్ణయించిందన్నారు. ఇందుకుగాను మండలం నుంచి ఒక్కొక్క గ్రామాన్ని ఎంపిక చేసిందని ఈ గ్రామంలో సర్వే పూర్తయిన తరువాత రెండవ గ్రామాన్ని కొండ చాకరా పల్లి గ్రామాన్ని ఎంపికచేసి రీ సర్వే ను ప్రారంబించారు. ఈ గ్రామాల్లో గత ప్రభుత్వం హయాంలో జరిగిన తప్పులు మళ్ళీ జరగకుండా చూడాలని ప్రభుత్వం పేర్కొంది. దీంతో ఒక్కొక్క గ్రామాల్లో రీసర్వేకు రెవెన్యూ అధికారులు సిద్ధమయ్యారు. ఇప్పటికే కొన్ని ఈసారి ఒక రెవెన్యూ గ్రామం రీసర్వే చేసేందుకు నెలలు రోజులు అవకాశం ఇచ్చారు. అలాగే ఉమ్మడి ఎన్‌పిఎమ్‌లు లేకుండా రైతుకు అనుకూలంగా రీసర్వే చేసేందుకు సిద్ధమవుతూ చేపట్టారు. గత ప్రభుత్వ హయాంలో రీసర్వేను ప్రారంభించినప్పటికీ రైతులు చాలా ఇబ్బందులకు గురౌతూ వస్తున్నారు. గత సర్వేలో ఒకరి భూమి వేరొకరి పేరున నమోదు చేయడం, మ్యుటేషన్‌కు అవకాశం లేకుండా పోవడంతో రైతులంతా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. తమ అవసరాలకు భూములను సైతం అమ్ముకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఉమ్మడి ఎల్‌పిఎమ్‌లతో వన్‌బిలు రాక అవస్థలు పడుతున్నారు దీంతో రెవెన్యూ కార్యాలయాల చుట్టూ కాళ్ళరిగేలా రైతులు ప్రతీ రోజు తిరుగుతున్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం వచ్చాక రీసర్వే లోపాలపై ఇది వరకే రెవెన్యూ సదస్సులను కూడా ప్రభుత్వ నిర్వహించింది. ఎల్.పి.ఎమ్‌ల సమస్యలు, ఒకరి భూమి మరొకరి పేరుమీద ఉండడం, విస్తీర్ణం హెచ్చు తగ్గులు వంటి ఫిర్యాదులు అందుతుండటం ఇలాంటి సమస్యలు లేకుండా రీసర్వే చేయాలని నిర్ణయించారు. ఈసారి ఉమ్మడి ఎల్‌పిఎమ్‌ల స్థానంలో ఒక్కొక్కరికి ఒక్కో ఎల్‌పిఎమ్ ఇచ్చేందుకు నిర్ణయించినట్లు సమాచారం. రైతులు పూర్తిగా సహకరిస్తేనే సర్వే ముందుకు సాగు తుందన్నారు.కార్యక్రమంలో సర్వేయర్ నాగేశ్వంరావు, వీఆర్వో పాపారావు, రైతులు పాల్గొన్నారు.

## పరీక్ష కేంద్రాలను పరిశీలించిన సీఐ



**వంగర, మార్చి 17(వార్త):** వంగర జిల్లా పరిషత్ పరీక్ష కేంద్రాన్ని రాజాం రూరల్ సీఐ సిహెచ్ ఉపేంద్రరావు సోమవారం పరిశీలించారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపట్టాలని ఎస్సై షేక్ శంకర్‌ను ఆదేశించారు. 10వ తరగతి విద్యార్థులకు పరీక్ష కాలంలో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపట్టాలని కోరారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు కారణంగా బయట వ్యక్తులు ఎవరు కేంద్రాలకు దగ్గర్లో ఉండకుండా గట్టి బందోబస్తు కల్పించడం జరిగిందని ఆయన అన్నారు. ఆయనతోపాటుగా ఎంఈఓ కే జగదీశ్వరి కూడా పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల వేదికకు11 దరఖాస్తులు

**పలాస, మార్చి 17(వార్త):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు (పి జి ఆర్ ఎస్ ) కార్యక్రమంకు పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘం కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ఈ పరిష్కార వేదికకు త్రాగునీటి కొరకు, జనన మరణ సర్టిఫికెట్లు కొరకు, వితంతు పెన్షన్లు వంటి పలు సమస్యలపై మొత్తం 11 దరఖాస్తులు రాగా అందులో జనన మరణ సర్టిఫికెట్ల కొరకు 8, వృద్ధాప్య పెన్షన్‌లు కొరకు 1, వితంతు పెన్షన్ కొరకు-1 త్రాగునీటి సరఫరా కొరకు-1 దరఖాస్తు అందినట్లు మున్సిపల్ కమిషనర్ తెలియజేసారు. కార్యక్రమంలో మునిసిపల్ సిబ్బంది ఉన్నారు.



# గెద్దలపాడులో దారుణం..!

**-ఉద్యోగానికి రాజీనామా చేయలేదని ఆశా వర్కర్ కుటుంబాన్ని వెలివేసిన గ్రామ పెద్దలు**

**సంతబొమ్మాళి, మార్చి 17 (వార్త):** గెద్దలపాడు తీంప్రాంత గ్రామంలో దారుణం చోటు చేసుకుంది. గ్రామ పెద్దలు ఏమి చెబితే అక్కడ అదే జరగాలని, దానికి వ్యతిరేకంగా ఏది జరిగిన గ్రామం నుండి వెలివేయడం పరిపాటిగా మారింది. గ్రామంలో ఇటువంటి సంఘటన సోమవారం చోటు చేసుకుంది. బోరుభద్ర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గెద్దలపాడు లో ఆశా వర్కర్‌గా ఎన్ .చంద్రమ్మ 2014 నుంచి పనిచేస్తుంది. గ్రామంలో ఉన్న ఆశావర్కర్ ,అంగన్వాడి, పోస్టులకు గ్రామ పెద్దలు వేలంపాట నిర్వహించారు. ఒక్కొక్క పోస్టుకు ఒక్కొక్క ధర నిర్ణయించారు. ఆ నిర్ణయించిన ధర చెల్లించిన వాళ్ళకి ఆ పోస్టులు అమ్మేశారు. అంగన్వాడి కార్యకర్త పోస్టును రెండు లక్షల రూపాయలకు వేరే మహిళ వేలంపాటలో దక్కించుకుంది.అప్పటివరకు అంగన్వాడి కార్యకర్త గా పనిచేస్తున్న హరిదేవి ని బలవంతంగా భయపట్టి రిజైన్ చేయించారు. ఆశా వర్కర్ పోస్టు కూడా ఒక లక్ష 90,000 వేలు రూపాయలకు వేరే మహిళ ఆ పోస్టును వేలంపాటలో దక్కించుకుంది. దీంతో ఇంతకాలం ఆశ వర్కర్ గా పనిచేస్తున్న ఎన్ .చంద్రమ్మ రిజైన్ చేయడానికి ససేమేరా అనడంతో గ్రామ పెద్దలు కన్నేర్ర చేశారు. ఈరోజు నుంచి చంద్రమ్మ కుటుంబసభ్యులతో ఎవరూ మాట్లాడకూడదని, సహాయం చేయకూడదని, వాళ్ళ ఇంటిలో జరిగే శుభకార్యాలకు వెళ్ళకూడదని గ్రామ పెద్దలు హుకుం జారీ చేశారు .దీన్ని ఎవరు అతిక్రమించిన తగిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## ఉగాది సందర్భంగా కబడ్డీ పోటీలు

**పలాస, మార్చి 17 (వార్త):** పలాస మండలం చిన్న గురుదాస్ పురం గ్రామంలో ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తేదీ 29 3 2025 నుండి తేదీ 33 2025 వరకు అనగా రెండు రోజులపాటు జిల్లా స్థాయి అవహానిత కబడ్డీ పోటీలు నిర్వహించబడును కబడ్డీ పోటీల్లో విజేతలకు మొదటి బహుమతి 15000 రూపాయలు ద్వితీయ బహుమతి 12 వేల రూపాయలు తృతీయ బహుమతి 10 వేల రూపాయలు చతుర్ధ బహుమతి పదివేల రూపాయలు, బెస్ట్ రైడర్ 2000 రూపాయలు, బెస్ట్ ఢిఫెండర్ 2000 రూపాయలు, బెస్ట్ ఆల్రౌండర్ 3000 రూపాయలతో పాటు సీల్డ్ బహుకరించబడును, అలాగే కబడ్డీ పోటీల్లో పాల్గొని క్రీడాకారులకు ఉచిత వసతితో పాటు భోజన సదుపాయం కల్పించబడును, పాల్గొనే అభ్యర్థులు తమ చిరునామాను, పాలిని కృష్ణారావు, 7063942370, జనగ ధర్మారావు 9073527344, పాలెం రమేష్ 9908226194 నెంబర్లకు సంప్రదించవలెను, చిన్న గురుదాస్ పురం గ్రామ ప్రజల సహకారంతో ఈ కబడ్డీ పోటీలు నిర్వహించబడునని, ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుల కోరడం జరిగింది. క్రీడాకారులు పోటీల్లో పాల్గొనాల్సిందిగా నిర్వాహకులు కోరుతున్నారు.



## మానవత్వం చాటుకున్న ఎమ్మెల్యే శిరీష

**-గిరిజన పదో తరగతి విద్యార్థులకు బస్సు ఏర్పాటు**

**మందస, మార్చి 17(వార్త):** వారంతా గిరిజన విద్యార్థులు.. మండలంలోని వివిధ గిరిజన ఆశ్రమాల్లో చదువుకుంటూ, 10వ తరగతి పరీక్షలు రాయడానికి సిద్ధమయ్యారు. సోంపేట, మందస, కంచిలి మండలాల్లోని మందస, పట్టులోగాం, నువాగడ, మాలగోవిందపురం, చిన్నకోస్టా, కిల్లోయి గిరిజన సంక్షేమ వసతి గృహాలకు చెందిన పలువురు గిరిజన విద్యార్థులకు మందస మండలంలోని బుడంబోకాలనీలో గల ఆశ్రమంలో పరీక్షా కేంద్రాన్ని అధికారులు ఏర్పాటు చేశారు. అయితే, పరీక్షలు రాయడం కన్నా, పరీక్షా కేంద్రానికి చేరుకోవడానికే ఎక్కువగా విద్యార్థులు గతంలో శ్రమించేవారు. సరైన సమయానికి చేరుతామా.. లేదా.. అనే టెన్షన్తో విద్యార్థులు పడుతున్న కష్టాలను పలాస ఎంఎల్ఎ గౌతు శిరీషా తెలుసుకున్నారు. దీంతో ఆమె పెద్ద మనసుతో గిరిజన విద్యార్థులకు ప్రత్యేక బస్సును ఏర్పాటు చేశారు. ఆయా ఆశ్రమాల నుంచి విద్యార్థులను పరీక్షా కేంద్రానికి తీసుకెళ్లి, మళ్లీ ఆశ్రమంలో దింపే బాధ్యతను ఎంఎల్ఎ శిరీషా తీసుకున్నారు. సరైన సమయానికి వస్తూ.. పరీక్షా కేంద్రానికి తీసుకెళ్తుండడంతో గిరిజన విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. కాగా, బస్సు ఏర్పాటు చేసిన ఎంఎల్ఎ శిరీషాకు గిరిజన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఆశ్రమాల ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.

## 25న కలెక్టరేట్ ధర్నాకు తరలిరండి




**కొత్తూరు, మార్చి 17(వార్త):** ఈ నెల 25న చలో కలెక్టరేట్ ధర్నాకు ఆదివాసీ గిరిజన ప్రజలు తరలి రావాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి నిమ్మక.అప్పన్న ఈ మేరకు పిలుపునిచ్చారు. సోమవారం నాడు ఆదివాసీ గిరిజన సంఘం ఆద్వర్యంలో గొట్టి పిల్లి ప్రాంతంలో చైతన్య యాత్ర సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఇటీవల జరిపిన సమగ్ర సర్వేలో గిరిజన గ్రామాల్లో అనేక సమస్యలు వెలుగు చూశాయి. అనేక గ్రామాల్లో మౌలిక సౌకర్యాలు కరువయ్యాయి, గిరిజనుల భూములకు రక్షణ కరువైంది. అనేక గ్రామాలలో సామాజిక భవనాలు గాని, అంగన్వాడీ కేంద్రాలు గాని లేవు. సాగునీరు, త్రాగునీరు లేక గిరిజన ప్రాంత ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. భూ ఆక్రమణలు అధికంగా ఉండటంతో గిరిజనుల భూములు గిరిజనేతరులు ఆక్రమిస్తూ, అడ్డుకున్న గిరిజనులపై దాడి చేస్తున్నారు. పోలీసులు తిరిగి గిరిజనులపైనే కేసులు పెడుతున్నారు. ఐటీడీఏ లేక గిరిజన గ్రామాలు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం గిరిజన గ్రామాలను అభివృద్ధి చేసేందుకు తక్షణమే చర్యలు చేపట్టాలని లేకుంటే గిరిజనులు అందరూ పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు సవర.దర్మారావు, శివ,దుర్గారావు,రామారావు,ఎ.పి.వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సిర్ల.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలి

**కొత్తూరు, మార్చి 17 (వార్త):** ఓంద్రుజోల గ్రామ పంచాయతీ సచివాలయం లో సోమవారం మహాత్మా గాంధీజీ గ్రామీణ ఉపాధి పథకం 2023, 2024 ఉపాధి పనులు గురించి సోషల్ ఆడిట్ సంబంధించినటువంటి సమావేశం ఏర్పాటు చేశారు.. సోషల్ ఆడిటర్ డిఆర్పి బి.నరేష్ ఈ సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ ఉపాధి హామీ వేతనదారులు వంద రోజుల పనిని గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఓంద్రుజోల సర్పంచ్ గంధవరపు ఈశ్వరి, సర్పంచ్ ప్రతినిధి నాగేంద్ర, మాజీ ఎంపీటీసీ నిమ్మగడ్డ కృష్ణమూర్తి, వార్డ్ మెంబర్స్ మరియు పంచాయతీ సెక్రెటరీ గవర డిల్లేశ్వరరావు, వీఆర్వో నారాయణరావు, టెక్నికల్ అసిస్టెంట్ సవర కామేష్, ఫీల్డ్ అసిస్టెంట్ హడ్డబెంగి అశోక్, సచివాలయ అధికారులు, మేట్స్, డ్వాక్రా గ్రూప్, ఉపాధి వేతనదారులు పాల్గొన్నారు.



## రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యం : కలెక్టర్




**శ్రీకాకుళం, మార్చి 17(వార్త):** రోడ్డు భద్రతా చర్యల ఆంక్షలను జిల్లాలో మరింత కఠినతరం చేయాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో జిల్లా రహదారుల భద్రతా సమన్వయ కమిటీ సమావేశం సోమవారం జరిగింది. ఈ సమావేశానికి కలెక్టర్, కమిటీ చైర్మన్ గా, ఎస్పీ కెవి మహేశ్వర్ రెడ్డి, కమిటీ మెంబర్ కన్వీనర్ డీటీసీ విజయ సారధి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గడిచిన కొద్దిరోజులుగా జాతీయ రహదారిపై పెద్ద సంఖ్యలో ప్రమాదాలు జరుగుతున్నాయని, పదుల సంఖ్యలో ప్రాణాలు కోల్పోతున్న సంఘటనలు చోటు చేసుకోవడం దురదృష్టకరమని అన్నారు. ప్రధాన రహదారుల్లో డివైడర్లను బ్రేక్ చేసి వాహన ప్రమాదాలకు అవకాశం కల్పిస్తున్న వారిపై చట్టపరమైన కేసులు నమోదు చేయాలన్నారు. ఇంజనీరింగ్ శాఖల వారీగా వారి సంబంధిత రహదారులపై తాజాగా జరిగిన ప్రమాదాలను విశ్లేషించి, వాటి నివారణకు తీసుకోవలసిన చర్యలను వివరించారు. రోడ్డు ప్రమాదాలు జరిగిన సమయంలో 108 వాహన సేవలు సకాలంలో అందేలా సంబంధిత వైద్య ఆరోగ్య శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా అతివేగం, డ్రైవింగ్ లైసెన్స్, హెల్మెట్ లేకుండా వాహనం నడపడం, పరిమితికి మించి ఆటోలో ప్రయాణికులను ఎక్కించుకోవడం, బస్సులు ఇతర వాహనాలలో అధిక లోడుతో సరుకు, ఇతర సామగ్రి రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవలసిందిగా రవాణా శాఖ అధికారులను ఆదేశించారు. జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జాతీయ రహదారిపై బ్లాక్ స్పాట్ లలో చోటు చేసుకుంటున్నాయని, అయినప్పటికీ హైవే అధికారులు తగు జాగ్రత్తలు తీసుకోవడంలో విఫలమవుతున్నారని అసంతృప్తిని వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలో ఓ నిండు గర్భిణీ ఆర్టీసీ బస్సు ఢీకొని చనిపోతే సంబంధిత యూనియన్‌లోని కొందరు వ్యక్తులు మానవతా విలువలను మర్చిపోయి వ్యవహరించిన తీరు బాధ కలిగించిందని అన్నారు. హిట్ అండ్ రన్ కేసుల్లో బాధితులకు త్వరితగతిన పరిహారం అందడం లేదని, బాధితులకు త్వరగా పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు.

**మత్తు పదార్థాల నియంత్రణపై సమీక్ష**

జిల్లాలో మత్తు పదార్థాల వినియోగం, విక్రయాలు, రవాణాను అరికట్టేందుకు చిత్తశుద్ధితో పని చేయాలని కలెక్టర్ అన్నారు. జిల్లా స్థాయి నార్కోటిక్స్ కంట్రోల్ కోఆర్డినేషన్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాదకద్రవ్యాల మూల సరఫరా రవాణాను అరికట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. జిల్లాలో మత్తు పదార్థాల నివారణ, మాదక ద్రవ్యాల అక్రమ రవాణా నిరోధంపై తీసుకుంటున్న చర్యలను జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర్ రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సమావేశంలో డిఎస్పీలు వివేకానందరావు, మూర్తి, వెంకట అప్పారావు, డీపీవో భారతి సౌజన్య, ఆర్అండ్బి ఎస్ఈ జాన్ సుధాకర్, నేషనల్ హైవేస్ ఆథారిటి పిడి తీవారీ, జిల్లా ఫైర్ ఆఫీసర్ మోహన్ రావు, మోటర్ వెహికల్ ఇన్స్పెక్టర్ గంగాధర్, ట్రాఫిక్, పోలీసు, రవాణా శాఖ అధికారులు, పలు ఎన్జీఓల ప్రతినిధులు, కమీటీ సభ్యులు పాల్గొన్నారు.

## విద్యార్థినుల్లో పోటీతత్వంతో ఉత్తమ ఫలితాలు



**మందస, మార్చి 17(వార్త):** విద్యార్థినిల్లో పోటీతత్వం ఉండాలని, దీంతో ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని బాలల హక్కుల పరిరక్షణ రాష్ట్ర కమీషనర్ కేశలి అప్పారావు అన్నారు. మందస మండలంలోని వీరగున్నమ్మపురం సమీపంలో గల కస్తూరిభాగాంధీ బాలికల విద్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినిలనుద్దేశించి మాట్లాడుతూ పరీక్షల సమయంలో ఒత్తిడి గురికావదన్నారు. కృషి, పట్టుదల, అంకితభావంతో చదువుకోవాలని, ప్రధానంగా పోటీతత్వం ఉండాలన్నారు. ప్రభుత్వం బాలికల విద్యకై రూ.కోట్లు వ్యయం చేస్తోందన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఎంతోమంది చదువుకుని, మంచిస్థాయిలో ఉన్నారని, వారిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థినిలకు అందించే ఆహారాన్ని పరిశీలించారు. కమీటీ స్వయంగా ఆహారాన్ని రుచి చూసి, సంతృప్తి వ్యక్తం చేసింది. అదేవిధంగా విద్యాలయం పరిసరాలను చూసి, ప్రిన్సిపల్ రఘుపాత్రుని వాసంతి చేస్తున్న కృషిని అభినందించారు. కార్యక్రమంలో బాలల సంక్షేమసమితి ఛైర్ పర్సన్ యు. శ్రీలక్ష్మి, సభ్యుడు ఎం.గన్నప్పడు, బాలల రక్షణ అధికారి కేవీ రమణ, బాలల రక్షణ అధికారి మెట్ట మల్లేశ్వరరావు, సమగ్రశిక్షా అభియాన్ ఏపీసీ ఎస్.శశిభూషణ్, జీసీడీఓ ఎస్.నీరజ, జిల్లా బాలల రక్షణ విభాగం కౌన్సిలర్ డి.సీతారాం, మల్లేశ్వరరావు, మందస, పలాస ఎంఈఓలు ఎం. లక్ష్మణరావు, నగిరి తారకేశ్వరరావు, చెరుకుపల్లి సత్యం, ప్రిన్సిపల్ రఘుపాత్రుని వాసంతి, బి. భాగ్యలక్ష్మి, పి.భవాని, ఎస్.మీనా, ఎం.ఇంద్రావతి, ఎల్.లలిత, ఎస్.భాగ్యలక్ష్మి, ఎస్. లావణ్య, పి.పావని, ఆర్.ఉమ, ఎం.శాంతిప్రియ, కేవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

## సర్వేలన్నీ సకాలంలో పూర్తి చేయాలి

**పలాస, మార్చి 17(వార్త):** ప్రభుత్వం నిర్దేశించిన సర్వేలను పూర్తి చేయాలని పలాస మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు ఆదేశించారు. పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘంలో ప్రస్తుతం జరుగుతున్న ఎం ఎస్ ఎం ఈ పి 4 సర్వే, వర్కింగ్ ఫ్రమ్ హెూం సర్వే, ఈ- కేవైసీ పెండింగ్, ఆస్తి పన్ను వసూలు ప్రగతిపై అన్ని సచివాలయాల నోడల్ అధికారులు, కార్యదర్శులతోనూ సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మాట్లాడుతూ సర్వేలపై అలసత్వం వహిస్తే తగు చర్యలు తీసుకొనుటకు కూడా వెనుకాడేది లేదని హెచ్చరించారు. ఆస్తి పన్ను వసూలు ను శత శాతం పూర్తి చేయాలని, సదరు ఆస్థి పన్ను వసూలులో సిబ్బంది ఎవరైనా అలసత్వం వహించి నా, భాధ్యతా రాహిత్యంగా వ్యవహరించినా వారిపై శాఖా పరమైన చర్యలు తీసుకొనబడునని హెచ్చరించారు. పట్టణ ప్రజలు పట్టణాభివృద్ధికి సహకరించాలని కోరారు. ఆస్థి పన్ను చెల్లింపులో ప్రజలు ఎవరైనా సహకరించక పోయినట్లైతే అలాంటి మొండి బకాయిదారుల ఇంటి కుళాయి కనెక్షన్స్, విద్యుత్ కనెక్షన్ల తొలగింపు, డోర్ టు డోర్ చెత్త కలెక్షన్ తీసుకోకపోవడం జరుగుతుందని, ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ యాక్ట్ 1965ప్రకారం జప్తు చేస్తామని హెచ్చరించారు. ప్లాస్టిక్‌ను సమూలంగా నిషేధించడం మనందరి బాధ్యత అని తెలియజేసారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్దేశిత లక్ష్యాలకు లోబడి సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ లో భాగంగా ప్లాస్టిక్ వాడకాలని శత శాతం నిషేధించుటకు టాస్క్ ఫోర్స్ టీములు, టాస్క్ ఫోర్స్ కో-ఆర్డినేటర్లు తో ప్లాస్టిక్ కవర్ల వాడకాన్ని పూర్తిగా నివారించుటకు గాను, ఎవరైనా సదరు ఆదేశములను అతిక్రమించినచో పెనాల్టీలు విధించి రైడ్స్ చేయవలసిందిగా సిబ్బందిని ఆదేశించారు. ప్లాస్టిక్ బ్యాగులకు బదులుగా జ్యూట్ బ్యాగులు, గుడ్డ సంచులను ప్రజలకు అందించే విషయాన్ని పరిశీలించి, మహిళా పొదుపు సంఘాలతో సమన్వయపరచుకొని ప్లాస్టిక్ కవర్లకు బదులుగా గుడ్డ సంచులు అందించే విషయంలో మహిళా సంఘాల యొక్క సహకారాన్ని కూడా తీసుకోవాల్సిందిగా తెలియజేశారు. 120 మైక్రాన్ల కంటే ఎక్కువ ఉన్న



కవర్లను ప్రోత్సహించి, మెప్మా ద్వారా జ్యూట్ బ్యాగులు, గుడ్డ సంచుల వాడకాన్ని ప్రజల్లోనికి తీసుకెళ్లడానికి గాను డ్వాక్రా బజార్లను కూడా ఏర్పాటు చేయవలసిందిగా ఆదేశించారు. దీనికి అందరూ కూడా కలసి కృషి చేయవలసిందిగా కోరారు . ఈ సమావేశంలో మున్సిపల్ కార్యాలయం మేనేజర్ ప్రభాకర్ రావు, మున్సిపల్ ఏ ఈ రాజమోహన్, మున్సిపల్ రెవెన్యూ ఇన్స్పెక్టర్ అమర్, అన్ని సచివాలయాల నోడల్ అధికారులు, కార్యదర్శులు, మెప్మా సిబ్బంది, ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

## మండల నిధులతో సీసీ రోడ్లు మంజూరు

**కొత్తూరు, మార్చి 17 (వార్త):** కొత్తూరు మండలంలోని కొత్త కొత్తూరు గ్రామానికి మండల ప్రజా పరిషత్ నిధులు ద్వారా నూతన సి.సి రోడ్డు కు నిధులను కేటాయించిన మండల వైస్ ఎంపీపీ లోతుగెడ్డ తులసీ వర ప్రసాద్ రావు . అందులో భాగంగా సోమవారం నాడు స్మశానవాటికకు నూతన రహదారికి శంకుస్థాపన చేశారు. మండలంలోని పెద్దఎత్తున పలు అభివృద్ధి పనులు చేయడం జరుగుతుందని లోతుగెడ్డ తులసీ వర ప్రసాద్ రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో లోతుగెడ్డ తాతబాబు, కొయిలాపు సంజీవ రావు,లోతుగెడ్డ కృష్ణ పాల్గొన్నారు.



# సారా రహిత సమాజాన్ని నిర్మిద్దాం

**-కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్**

**- ప్రచార రథం ప్రారంభం**



**శ్రీకాకుళం, మార్చి 17(వార్త):** సారా రహిత సమాజం దిశగా ప్రభుత్వం చేస్తున్న కృషిలో భాగంగా, శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఒక ప్రత్యేక కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ “నాటు సారా రహిత సమాజం” అనే పోస్టర్‌ను ఆవిష్కరించారు. అలాగే, ఈ లక్ష్యాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడానికి ఒక ప్రచార రథాన్ని కూడా ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నాటు సారా వల్ల కలిగే దుష్పరిణామాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని, నాటు సారా తయారీ, రవాణా, విక్రయాలను అరికట్టడానికి ప్రజల సహకారం అవసరమని అన్నారు. ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ, నాటు సారా సమాచారం కోసం టోల్ ఫ్రీ నెంబర్ 14405 ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ నెంబర్‌కు ఫోన్ చేసి సారా తయారీ, రవాణా, విక్రయాలకు సంబంధించిన సమాచారాన్ని అందించవచ్చని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ పి రామచంద్రారావు, జిల్లా ప్రొఫెషన్ అండ్ ఎక్సైజ్ అధికారి సిహెచ్ తిరుపతి నాయుడు పలువురు ఎక్సైజ్ సీఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

**ప్రచార రథం వివరాలు :**

ఈ ప్రచార రథం జిల్లాలోని వివిధ గ్రామాల్లో పర్యటిస్తూ, నాటు సారా వల్ల కలిగే దుష్పరిణామాల గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తుంది. అలాగే, నాటు సారా సమాచారం కోసం ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నెంబర్ 14405 గురించి కూడా ప్రచారం చేస్తుంది.

ఈ కార్యక్రమం ద్వారా నాటు సారా రహిత సమాజం దిశగా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

# వంశ'ధార' కోసం ఉద్యమించాలి




**మందస, మార్చి 17(వార్త):** వంశధార నుంచి ఈ ప్రాంతానికి సాగు నీరు తీసుకు రావడానికి ఉద్యమాలు చేస్తామని రైతు సంఘాలు, ప్రజా సంఘాలు, వామ పక్షాలు నాయకులు అన్నారు. మందస మండలంలోని హరిపురంలో జరిగిన వంశధార సాధన కమిటీ సమావేశంలో వారు మాట్లాడుతూ మందస మండలంతో పాటు ఇచ్ఛాపురం అసెంబ్లీ నియోజకవర్గం వరకూ వంశధార నది నీటిని మళ్లించడానికి ప్రత్యేకంగా సాగునీటి కాలువలను నిర్మించాలన్నారు. వేలాది ఎకరాల్లో రైతులు కేవలం వర్షం మీద ఆధార పడుతున్నారని, వరుణుడు కరుణిస్తేనే పంటలు పండుతున్నాయని ఆ సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ అన్నారు. ప్రతి ఏడాది ప్రకృతి వైపరిత్యాలతో పాటు సకాలంలో వర్షాలు లేక కరువు ఛాయలు అలముకుంటున్నాయని అభిప్రాయ పడ్డారు. పాలకుల నిర్లక్ష్య వైఖరి, అభూత కల్పనలతో వంశధార కాలువలను నిర్మించకుండా జాప్యం చేస్తున్నారని వక్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. నాలుగు దశాబ్దాలుగా ఈ ప్రాంతం రైతాంగం పొలాలకు వంశధార నీరు సరఫరా చేయాలని పాలకులను వేడుకున్నా పట్టించుకోకుండా, హామీలతో కాలం గడుపుతున్నారని వక్తలు ఆరోపించారు. వంశధార కాలువల నిర్మాణం చేసి, కాలువల ద్వారా నీటి సరఫరాకు చర్యలను తీసుకొని రైతాంగాన్ని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. పలాస నియోజకవర్గంలో పలాస,వజ్రపుకొత్తూరు, మండలాలవరకే వంశధార కాలువలు ఉన్నాయని, ఈ కాలువలను ఈ ప్రాంతం వరకూ పొడిగింపునకు చర్యలను తీసుకోవాలని సమావేశం కోరింది. వంశధార కాలువల సాధన కోసం దశలవారీగా ఉద్యమం చేపట్టాలని సమావేశంలో తీర్మానించారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రధాన శివాజీ, రిటైర్డు ఎంపీడీఓ పి. సూర్యనారాయణ రెడ్డి, రిటైర్డు ఎంఈఓ మజ్జి బాబూరావు, కొర్ల హేమారావు చౌదరి, మామిడి మాధవరావు, ధర్మార్పు వెంకటరావు, నల్ల హడ్డి, బి. కామేశ్వరరావు, శిస్టు బాపూజీ, ముకుంద, డి.నారాయణ, ఉగ్రివల్లి కృష్ణారావు, ఉగ్రివల్లి సూర్యారావు, వెదుళ్ళ మాధవరావు, గొరకల మాధవరావు, దుంపల వైకుంఠ రావు, దుంపల లింగరాజు తదితరులు పాల్గొన్నారు.

# హైకోర్టు ఆదేశాలు పట్టవా?

**-ధిక్కరిస్తున్న పోర్ట్ యాజమాన్యం**

**-దొంగతనంగా పనులు చేపడుతున్న వైనం**



**సంతబొమ్మాళి, మార్చి 17(వార్త):** హైకోర్టు ఆదేశాలను ధిక్కరిస్తూ మూలపేట పోర్ట్ యాజమాన్యం ఉప్పుమడుల్లో దౌర్జన్యంగా రోడ్డు నిర్మాణం చేపట్టడం అడ్డుకున్న ఉప్పు కార్మికులు పై దాడి చేసిన విషయం విదితమే. నౌపడ సాల్ట్ రన్ 1956 ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ గత 65 ఏళ్లుగా 400 ఎకరాల్లో ఉప్పుసాగును చేస్తున్నారు. ఎటువంటి సమాచారం ఇవ్వకుండా నష్టపరిహారం చెల్లించకుండా ఉప్పుమడుల మీదుగా పోర్ట్ యాజమాన్యం రోడ్డు నిర్మాణం చేపడుతున్నారు. ఉప్పు తయారీ యాజమాన్యం, కార్మికులు పోర్ట్ రోడ్డు నిర్మాణం పనులను అడ్డుకున్న ఫలితం లేకపోవడంతో హైకోర్టును ఆశ్రయించారు. దీంతో హైకోర్టు ఇటీవల రోడ్డు పనులు ఆపాలని యధావిధిని కొనసాగించాలని స్టేటస్ కో ఆర్డర్ జారీ చేశారు. హైకోర్టు ఆర్డర్ కాపీని జిల్లా కలెక్టర్, ఆర్డీవో, ఇతర ఉన్నతాధికారులకు మెయిల్ ద్వారా ఉప్పు కంపెనీ యాజమాన్యం అందజేశారు. దీంతో వారం రోజులు పాటు రోడ్డు నిర్మాణ పనులను పోర్ట్ యాజమాన్యం నిలుపుదల చేశారు. తరువాత ఫిబ్రవరి 28 అర్ధరాత్రి నుండి రోడ్డు నిర్మాణ పనులను పోర్ట్ యాజమాన్యం శరవేగంగా చేపట్టింది. మరుసటి రోజు శనివారం కూడా నిర్మాణం జరుగుతున్న రోడ్డు పనులను ఉప్పు కార్మికులు, యాజమాన్యం అడ్డుకున్నారు. ఈ విషయాన్ని ఏ అధికారికి చెప్పిన పట్టించుకోలేదని ఉప్పు తయారీ యాజమాన్యం వాపోయింది. ఉప్పు మడుల్లో రోడ్డు వేయడం వల్ల ఉప్పు సాగు ప్రశ్నార్ధికంగా మారిందని ఆవేదన వ్యక్తం చేసిన విషయం పలు పత్రికల్లో కథనాలు రావడంతో పోర్టు యజమాన్యం కొద్ది రోజులు నిర్మాణం పనులు నిలుపుదల చేసి మళ్లీ ఆదివారం అర్ధరాత్రి నుండి ఎటువంటి అనుమతులు లేకుండా దొంగతనంగా హైకోర్టు స్టేటస్ కో ఆదేశాలను బేఖాతరు చేస్తూ పోర్టు యజమాన్యం పనులు ప్రారంభించింది. హైకోర్టు స్టే ఇచ్చిన పోర్టు యాజమాన్యం దౌర్జన్యంగా రోడ్డు నిర్మాణం చేపట్టడంపై ఎన్.ఎస్ సాల్ట్ కంపెనీ యాజమాన్యం మళ్లీ హైకోర్టును ఆశ్రయించినట్లు తెలిపారు.



## ప్రభుత్వ సిబ్బందికి నేటినుంచి కంప్యూటర్ శిక్షణ



**శ్రీకాకుళం, మార్చి 17(వార్త):** ప్రభుత్వ శాఖల నుంచి ఇద్దరు లేదా ముగ్గురికి ఈ నెల 18 నుంచి 22 వరకు కంప్యూటర్ శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వెల్లడించారు. సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఆయన మాట్లాడుతూ అన్ని శాఖల నుంచి ఉద్యోగుల జాబితాలను సిద్ధం చేసి సత్వరమే అందజేయాలన్నారు. కంప్యూటర్ శిక్షణలో ఆర్టిఫిషియల్ ఇంటిలిన్స్, పవర్ పాయింట్ ప్రజెంటేషన్, ఎక్సెల్ షీట్స్, అడ్వాన్స్ టూల్స్ పై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. 18, 19 తేదీల్లో కలెక్టరేట్ కార్యాలయ సిబ్బందికి, జిల్లా కేంద్రంలో ఉన్న ఆయా శాఖల సిబ్బందికి కలిపి 100 మంది ఉద్యోగులకు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు కంప్యూటర్ శిక్షణ ఉంటుందని తెలిపారు. మార్చి 20వ తేదీన టెక్కలి డివిజన్ కేంద్రంలో 40 మందికి, మార్చి 21వ తేదీన పలాస డివిజన్ కేంద్రంలో 30 మందికి, మార్చి 22వ తేదీన శ్రీకాకుళం డివిజన్ కేంద్రంలో 30 మంది ఉద్యోగులకు శిక్షణ ఉంటుందని ఆయన వివరించారు. మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా ఉద్యోగుల నైపుణ్యాభివృద్ధి చేసుకునేందుకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## టైలరింగ్ శిక్షణకు పేర్లు నమోదు చేసుకోండి



**శ్రీకాకుళం, మార్చి 17(వార్త):** బి.సి. కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి కొరకు సబ్సిడీ తో కూడిన ఋణాల కోసం నమోదు చేసుకోవాలని బిసి కార్పొరేషన్ ఇడి గడ్డెమ్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. https://apobmms.apcfss.in సైట్ లో మీ సేవా కేంద్రాల్లో గాని, ఇంటర్నెట్ సెంటర్ లేదా మీ సంబంధిత సచివాలయంలో గాని నమోదు చేసుకోవలిసినదిగా ఆమె కోరారు. దారిద్ర్య రేఖకు దిగువన వున్న 18-50 సంవత్సరాల మధ్య ఉన్న వెనుకబడిన తరగతులు, కాపు (తెలగ, భలిజ మరియు ఒంటరి) మరియు అగ్ర వర్ణాల్లోని పేదలకు (కమ్మ, రెడ్డి, ఈ.బి.సి., క్షత్రియ, ఆర్య వైశ్య, బ్రాహ్మణ) చెందిన మహిళల అభివృద్ధి కొరకు బేసిక్ టైలరింగ్ ట్రైనింగ్ పథకం ద్వారా శిక్షణ ఇవ్వబడును. ఆశక్తి గల శిక్షణ పొందగోరు అర్హులైన మహిళా అభ్యర్ధులు పూర్తి వివరములు కొరకు సంబందిత గ్రామ/ వార్డు సచివాలయం ద్వారా మండల పరిషత్ అభివృద్ధి అధికారి/ మున్సిపల్ కమీషనర్ వారిని సంప్రదించి ఈ నెల 22లోగా నమోదు చేసుకోవాలని ఆమె ఆ ప్రకటనలో కోరారు.

## 28న విశాఖలో తపాలా అదాలత్

**శ్రీకాకుళం, మార్చి 17(వార్త):** విశాఖపట్టణం పోస్టల్ రీజియన్ పరిధిలోని తపాలా వినియోగదారుల వ్యక్తిగత ఫిర్యాదులు సమస్యలు పరిష్కరించు నిమిత్తము ఈ నెల 28న ఉదయం 11 గంటలకు పోస్టుమాస్టర్ జనరల్ వారి కార్యాలయం, బస్ కాంప్లెక్స్ ప్రక్కన, విశాఖపట్నం నందు తపాలా అదాలత్ నిర్వహిస్తారని ఆ శాఖ అధికారులు తెలిపారు. ఈ తపాలా సర్వీసులకు సంబంధించిన ప్రత్యేక, వ్యక్తిగత ఫిర్యాదులు మాత్రమే ఈ అదాలత్ నందు చర్చించబడును. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, కాకినాడ, తూర్పు గోదావరి, డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాల పరిధిలోని తపాలా వినియోగదారులు తమ సమస్యలు, ఫిర్యాదులు ఈ నెల 24లోగా “117వ తపాలా అదాలత్” అను శీర్షికతో కేవీడీ సాగర్, అసిస్టెంట్ డైరెక్టర్, పోస్టుమాస్టర్ జనరల్ కార్యాలయం, విశాఖపట్నం-530017” అను చిరునామాకు పంపాలని కోరారు.

## ఇంటి నిర్మాణానికి అదనపు సాయం

**పలాస, మార్చి 17(వార్త):** ప్రధానమంత్రి ఆవాస్ యోజన(పి ఎం ఏ వై) కింద 350 చదరపు అడుగులు స్వంత స్థలము ఉండి ఇల్లు నిర్మించు కోదలచిన పేద వారికి కేంద్ర ప్రభుత్వం 2,50,000 రూపాయలు సబ్సిడీ మంజూరు చేస్తారని, మార్చి 31 వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం మాత్రమే ఉందని,ఈ అవకాశాన్ని అందరూ కూడా వినియోగించు కోవాల్సిందిగా పలాస మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు తెలియజేసారు. ఈ పథకం కింద ఇప్పటి వరకు 68 దరఖాస్తులు మంజూరు కాబడినట్లు, 235 స్థలము లేనట్టి దరఖాస్తులు ఆన్లైన్లో రిజిస్టర్ కాబడినట్లు కమిషనర్ తెలియజేశారు. మిగిలిన వారంతా ఈ పథకం కింద స్వంత స్థలము ఉండి ఎవరైనా దరఖాస్తు చేసుకొనదలచినా, అట్టివారు మీ సమీప సచివాలయమునకు వెళ్లి రిజిస్టర్ చేసుకోవాల్సిందిగా కోరారు, ఈ పథకం కింద దరఖాస్తుకు చివరి తేదీ ఈ నెల 31 అని తెలిపారు.

## బోర్లు మరమ్మతులకు ప్రత్యేక డ్రైవ్

**వంగర, మార్చి 17(వార్త):** గ్రామాల్లో మరమ్మతులకు గురైన మంచి నీటి బోర్లకు మరమ్మతులు చేపట్టనున్నట్లు ఎంపీపీ సురేష్ ముఖర్జీ వెల్లడించారు. ప్రతీ గ్రామంలో పాడైన బోర్లకు కొత్త పార్టులు వేసి మంచి నీటి ఇబ్బందులు లేకుండా చేయటానికి ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టినట్లు వివరించారు. బోర్ మెకానిక్ లకు కిట్లను అందజేశారు. సోమవారం మగ్గూరు, ఓనే అగ్రహారం గ్రామాల్లో పాడైన బోర్లకు మరమ్మతు పనులు చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎల్. త్రినాధరావు, బోర్ మెకానిక్‌లు కృపారావు, తవితయ్య, రామకృష్ణ పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

## శ్రీకాకుళం



బార్ అసోసియేషన్‌కు ఎన్నికలకు

# నామినేషన్ల పర్వం

* అధ్యక్ష పదవికి నామినేషన్ వేసిన కూన రాజారావు
* అనుచరులతో కలిసి నామినేషన్ పత్రాలు అందజేత తనను గెలిపించాలని రాజారావు అభ్యర్థన

**శ్రీకాకుళం లీగల్, మార్చి 17 (వార్త):** శ్రీకాకుళం జిల్లా బార్ అసోసియేషన్ ఎన్నికలు త్వరలో జరగనుంది. అధ్యక్ష పదవికి సీనియర్ న్యాయవాది కూన రాజారావు సోమవారం అనుచరులతో కలిసి నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారికి అందజేశారు. కూన రాజారావుకు శ్రీకాకుళం జిల్లా బార్ అసోసియేషన్‌లో మంచి వ్యక్తిగా పేరు ఉంది. గతంలో కూడా ఆయన పోటీ చేశారు. నామినేషన్ పత్రాలు వేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ అన్ని సామాజిక వర్గాల న్యాయవాదులు తనకు మద్దతు ఇస్తుండడంతో బరిలోకి దిగానన్నారు. ఒక్క అవకాశం ఇస్తే శ్రీకాకుళం బార్ అసోసియేషన్ అభివృద్ధికి, న్యాయవాదుల సంక్షేమానికి కృషి చేస్తానన్నారు. గతంలో రెండుసార్లు శ్రీకాకుళం జిల్లా బార్ అధ్యక్ష పదవికి పోటీ చేశానన్నారు. ఈసారి తనకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కూన రాజారావు కోరారు.



## 8అడుగుల రోడ్డులో

# అపార్టుమెంట్ నిర్మాణం

* నిబంధనలకు తిలోదకాలు * ప్లాన్ ఏవిధంగా ఇచ్చారో అని సర్వత్రా అనుమానాలు
* రోడ్డుపైనే భవన నిర్మాణ సామగ్రితో స్థానికుల ఇక్కట్లు * కన్నెత్తి చూడని నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ అధికారులు

**శ్రీకాకుళం క్రైం, మార్చి 17 (వార్త):** శ్రీకాకుళం నగరంలోని డైమాండ్ పార్కు సమీపంలో ఎనిమిది అడుగుల రోడ్డులో అపార్టుమెంట్‌ను నిబంధనలు అతిక్రమించి నిర్మిస్తున్నారు. అసలు ఈ బహుళ అంతస్తు భవన నిర్మాణానికి నగరపాలక సంస్థ టౌనింగ్ ప్లాన్ అధికారులు ఏవిధంగా అనుమతులు ఇచ్చారన్నది ఎవరికీ అంతుపట్టడం లేదు. భవనం నిర్మించాలంటే నిబంధనలు మేరకు 30 అడుగులు రోడ్డు ఉండాలి. అయితే ఈ రోడ్డులో కేవలం ఎనిమిది అడుగులు మాత్రమే ఉంది. భవన నిర్మాణదారుడు మాత్రం తాను అన్ని అనుమతులతో అపార్టుమెంట్ వేస్తున్నానని చెబుతున్నాడు. అసలు ప్లాన్ ఏవిధంగా ఇచ్చారో అన్నది ఆ పెరుమాళ్‌కే ఎరుక. అయితే ఈ భవన నిర్మాణానికి గాను ప్లాన్ ఇచ్చేందుకు పెద్దమొత్తంలో చేతులు మారాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ భవనం బాకర్‌సాహెబ్‌పేట సచివాలయం పరిధిలో ఉంది. అయితే అక్కడ పనిచేస్తున్న సిబ్బందికి ఆ భవనం వైపు కన్నెత్తి చూడొద్దని నగరపాలక సంస్థ అధికారులు హుకుం జారీ చేసినట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి. దీంతో సచివాలయం సిబ్బంది అటుగా వెల్లడం లేదట. నగరపాలక సంస్థలోని కొందరు టౌన్‌ప్లానింగ్ అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీనికితోడు ఈ భవన నిర్మాణానికి గాను అవసరమైన మెటీరియల్‌ను రోడ్డుపైనే వేస్తుండడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపైనే ఇనుప చువ్వలు, ఇసుక, చిప్స్ వేస్తున్నారని, దీనివల్ల వాహనచోదకులు అవస్థలకు గురవుతున్నారు.





# పలాసలో భారీ చోరీ

* 12 తులాల బంగారం, 30 తులాల వెండి ఆభరణాలు, లక్ష నగదు అపహరణ * తీర్థయాత్రలకు వెళ్లి తిరిగివచ్చేసరికి లూటీ * వరుస దొంగతనాలతో హడలిపోతున్న పట్టణ ప్రజలు

**పలాస,మార్చి 17(వార్త):** ఆ కుటుంబం తీర్థయాత్రలకు వెళ్లి.. ఇంటి వచ్చేసరికి వారంతా షాక్ తిన్నారు. ఇంట్లో దొంగలు చొరబడి 12 తులాలు బంగారం, 30 తులాల వెండి ఆభరణాలు, లక్ష నగదు చోరీ చేసినట్టు గుర్తించి వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. వివరాల్లోకి వెళితే.. పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని కాశీబుగ్గ గాంధీగనర్ వివేకానంద కాలనీలో నివాసం ఉంటున్న మెట్ట సుదర్శనరావు భార్య భానుమతితో కలిసి ఈ నెల ఒకటో తేదీన తీర్థయాత్రలకు వెళ్లారు. సోమవారం మధ్యాహ్నం తిరిగి ఇంటికి వచ్చే సరికి ఇంటి తాళాలను పగలగొట్టి ఉండటం గమనించి 100 ఫోన్ ద్వారా పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ఆరాతీశారు. చోరీ జరిగినట్లు గుర్తించి దర్యాప్తు చేపట్టారు. ఇంటిలోపలకు వెళ్లి చూసినప్పటికీ బీరువా తలుపులు తెరిచి ఉండడం, ఇంటిలో సామగ్రి చిందరవందరగా పడి ఉండడాన్ని గమనించారు. బీరువాలో ఉన్న 12 తులాల బంగారం, లక్ష నగదు అపహరణకు గురైయినట్లు గుర్తించారు. శ్రీకాకుళం క్రూస్ టీం సిబ్బంది ఆరా తీశారు. కాశీబుగ్గ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కాశీబుగ్గ సిఐ పి సూర్యనారాయణ తెలిపారు. ఇటీవల పలాస కాశీబుగ్గలో వరుస దొంగతనాలలో పట్టణ ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు.

## విద్యార్థులకు మజ్జిగ పంపిణీ



**ఎల్ఎన్‌పేట, మార్చి 17(వార్త):** లక్ష్మీనర్సుపేట ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు విద్యార్థులకు ప్రధానోపాధ్యాయుడు లయన్. డా.ఎం.కె.మిశ్రో సొంత నిధులతో సోమవారం మజ్జిగ పంపిణీ చేశారు. గత ఐదేళ్లుగా వేసవిలో విద్యార్థులకు మజ్జిగ పంపిణీ కార్యక్రమం చేపడుతున్నామని మిశ్రో మాస్టారు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు టి.ఉపేంద్ర, వీర్వోలు రమణమ్మ, అప్పలరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మానవ రూపంలో భగవంతుడు మెహర్ బాబా

శ్రీకాకుళం, మార్చి 17(వార్త): మానవ రూపంలో ఉన్న భగవంతుడు అవతార్ మెహర్ బాబా అని శ్రీకాకుళం మెహర్ బాబా ఆలయ కమిటీ అధ్యక్షుడు.. ప్రముఖ సామాజిక సేవకులు.. గుడ్ల సత్యనారాయణ అన్నారు. మానవాళి మనుగడకు.. మౌనమే సరైన మార్గం అని నమ్మిన వ్యక్తి మెహర్ బాబా అని కొనియాడారు. సోమవారం శ్రీకాకుళం నగరంలో బెహరా మనో వికాసకేంద్రంలో మానసిక వికలాంగుల సమక్షంలో వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ గవర్నర్ గుడ్ల సత్యనారాయణ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా బెహరా మనో వికాస కేంద్రం అభివృద్ధి పనులకు 20 వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని కమిటీ ప్రతినిధులు శేఖర్..శ్యామల లకు అందించారు. మానసిక వికలాంగులకు అల్పాహారం అందజేశారు. ఈ కార్యక్రమంలో మీడియా ప్రతినిధులు కొంఖ్యాన వేణుగోపాల్.. శాసపు జోగినాయుడు, స్టార్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు గేదెల ఇందిరాప్రసాద్, గుడ్ల జగ్గారావు, డాక్టర్ బొడ్డేపల్లి ప్రసాద్ రావు, డాక్టర్ ఎం. వాసుదేవ్, గోలీ ఉమా మహేశ్వర రావు, గేదెల లక్ష్మీ, వాసంతి, రామ్ బాయ్, ఎండ మోహన్, మెహర్ బాబా ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts college wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546